క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ



ఆర్థిక సాయం అందజేస్తున్న మహేశ్‌యాదవ్

కడ్తాల్: మండల పరిధిలోని ఎక్వాయిపల్లిలో అనారోగ్య సమస్యలతో మృతి చెందిన కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకుడు జెనిగల మహేశ్‌యాదవ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాదయ్యను పరామర్శించి రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, నాయకులు చంటి, భిక్షపతి. నవీన్, సాధిక్, రాజేశ్, లక్ష్మణ్, మధు, మహేశ్, రాకేశ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: మండల పరిధిలోని కొత్తకుంట తండాకు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. నగరంలోని బీఆర్‌ఎస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పత్యానాయక్, సత్యం, శివనాయక్, జైపాల్‌నాయక్, లాల్య, జాన్యనాయక్, బాలు, మహేశ్, రాంజ్య, బాలు, బీమ్లా. గన్య తదితరులున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం, ఎంపీటీసీ మాజీ సభ్యులు కుమార్, చందునాయక్, పార్టీ నాయకులు లాలయ్య, జాన్యనాయక్ తదితరులు ఉన్నారు.

నూతన ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ విజయలక్ష్మిని సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

మాడ్గుల: మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి పెద్దపీట వేస్తానని నూతన ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. ఇక్కడ పనిచేసిన పద్మావతి ప్రమోషన్‌పై వెళ్లడంతో ఎంపీఓ వేజన్న ఇన్‌చార్జిగా వ్యవహరించారు. బుధవారం నూతన ఎంపీడీఓగా విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించి ఆహ్వానించారు.

చదువులో రాణిస్తే బంగారు భవిష్యత్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు: చదువులో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని మాస్టర్స్ డిగ్రీ కళాశాల చైర్మన్ చుక్క అల్లాజీగౌడ్ అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చందు, అధ్యాపక బృందం పాల్గొంది.

ఎన్‌ఎస్‌ఎస్ సేవలు ప్రశంసనీయం



ఎన్‌ఎస్‌ఎస్ జెండా ఆవిష్కరణలో దాసు తదితరులు

ఇబ్రహీంపట్నం: ఎన్‌ఎస్‌ఎస్ సేవలు ప్రశంసనీయమని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మంఖాల దాసు అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో రాయపోల్‌లోని సూర్యోదయనగర్ కాలనీలో నిర్వహిస్తున్న స్వచ్ఛత కార్యక్రమాలను పురస్కరించుకుని బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చింతల రాకేశ్ భవాని, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశం మెచ్చిన కలాం

ఘనంగా మాజీ మిస్సైల్ మాన్ జయంతి వేడుకలు

ఆమనగల్లు: పట్టణంలోని జెడ్పీహెచ్(బాలికల) పాఠశాలలో బుధవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను టీఎస్‌ఎస్‌ఓ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎస్‌ఓ నాయకులు చిక్కి, మహేందర్, శివ, రాజు, అభి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశప్రగతికి బాటలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం మిస్సైల్‌మాన్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్కాల పరమేశ్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశప్రగతి బాటలు వేసిన మహనీయుడు కలాం అన్నారు. ప్రతీ విద్యార్థి ఆయన స్ఫూర్తిగా ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, బాషయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు .



ఆమనగల్లు: టీఎస్‌ఎస్‌ఓ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి నివాళి



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో..

యువతకు స్ఫూర్తి

కడ్తాల్: భవిష్యత్ తరాలకు మార్గదర్శకుడిగా, యువతకు స్ఫూర్తి ప్రదాతగా భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి ఎనలేని సేవలు అందించారని ఎఫ్‌బీసీ సీనియర్ సెకండరీ పాఠశాల సహ వ్యవస్థాపకుడు రమేశ్ అన్నారు. బుధవారం కలాం జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, కోఆర్డినేటర్ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



కడ్తాల్: కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఓటు చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదం



డీసీసీ అధ్యక్షుడు చల్లాకు సంతకాల ప్రతులు అందజేస్తున్న నాయకులు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ జగన్‌నాయక్

కడ్తాల్: ఓటు చోరీకి పాల్పడి కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని.. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ విస్లావత్ జగన్ నాయక్ అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ గ్రామం నుంచి వంద మంది సంతకాల సేకరించాలని ఏఐసీసీ ఆదేశాలిచ్చిందని చెప్పారు. ఈ మేరకు పలువురు నాయకులు సేకరించిన సంతకాల ప్రతులను డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రవీందర్‌నాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, నాయకులు జంగయ్య, భోనా నాయక్, రాంచందర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకా

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు చల్లంపల్లి, ముద్విన్, రావిచేడ్ గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం గాలికుంటు టీకా వేశారు. మండల పశువైద్యాధికారి భానునాయక్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు 528 ఆవులకు, 69 గేదేలకు టీకా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేవీఓ రాజేశ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



టీకా వేస్తున్న డాక్టర్ భానునాయక్

స.హ చట్టంపై అవగాహన కల్పించాలి

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: గ్రామాల్లో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతపై గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా పారిశుద్ధ్య నిర్వహణ, నర్సరీల్లో మొక్కల పెంపకం, వన మహోత్సవం, పన్ను వసూళ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపీఓ గిరి రాజు పాల్గొన్నారు.

నేడు బీజేపీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం

హాజరుకానున్న మెదక్, చేవెళ్ల ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం గ్రామం కుండె వెంకటేశ్ ఫాంహౌస్‌లో గురువారం బీజేపీ మండల నాయకుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల అధ్యక్షుడు టి.యాదిశ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ నాయకులు హాజరవుతున్నారని, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి

చేవెళ్ల: విద్యార్థులు ఆరోగ్యంపై తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, ఊరేళ్ల, కమ్మెట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వెల్స్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై, కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ప్రొజెక్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్, హెచ్‌ఎం మాట్లాడుతూ.. చదువుకునే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు వారి ఉన్నత భవిష్యత్తుకు ఉపయోగపడుతాయన్నారు. పోషకాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పదో తరగతి తర్వాత కోర్సులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కడ అందుబాటులో ఉన్నాయనే విషయాలను తెలియజేశారు. లక్ష్య సాధనకు విద్యార్థులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ సీఎస్‌ఆర్ హెడ్ కె.సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం

షాద్‌నగర్‌రూరల్: వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభమైందని, రైతులను దృష్టిలో పెట్టుకొని మార్కెట్‌యార్డులో మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను గ్రామాల్లో దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు. నాణ్యమైన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తామన్నారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి

డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్

కడ్తాల్: అమ్మవారి ఆయల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్ కోరారు. బుధవారం ఆయన మండల పరిధిలోని కానుగుబావి తండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు నగేశ్ ఆలయాభివృద్ధికి రూ.10,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రయంలో నాయకులు బీచ్యానాయక్, పాండునాయక్, రాజు, దేవుల, నరేశ్, చరణ్, అఖిల్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణకు సన్మానం



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాంరెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం జెడ్పీహెచ్‌ఎస్‌లో 530 విద్యార్థులకు బుధవారం బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. అనంతరం వాసవి ఇంపాక్ట్–2025 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి హాజరైన 1,500 మంది విద్యార్థులకు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణతో కలిసి బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీనారాయణకు పుష్పగుచ్ఛం, మొమెంటో అందజేశారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధామాధురి

ఇబ్రహీంపట్నం: అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధామాధురి అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం, జాతీయ ఆరోగ్య మిషన్, ఈఎంఆర్ఐ, జీహెచ్‌ఎస్ 108 సర్వీసుల ఆధ్వర్యంలో సంయుక్తంగా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె ఆగిపోయిన వ్యక్తికి అత్యవసరంగా చేయాల్సిన ప్రాణ రక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సరిత, డాక్టర్ ప్రియాంక, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్, ఈఎంఈ రాజబాబు, 102 ఈఎంఐ ప్రదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వ్యసనాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి

యాచారం: పాఠశాల రోజులు ఎంతో విలువైనవని.. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకుని ఉద్యోగాలు సాధించాలని యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి సూచించారు. బుధవారం గునుగుల్ పాఠశాలలో డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర అలవాట్లతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ నందీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో సీఐ సత్యనారాయణ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సమావేశమై ఉద్యోగాల సాధనతోనే కుటుంబాల్లో ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని తెలిపారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు మధు, సైదులు, వంశీ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

మాడ్గుల: మండల పరిధిలోని నాగిళ్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని స్కూల్ డెవలప్‌మెంట్ అండ్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు, విద్యార్థులకు ప్రయాణానికి ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఇందుకు డీఎం వెంకటనర్సప్ప సానుకూలంగా స్పందించారని చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, సభ్యులు సోమా, రాజు, సత్యనారాయణ, జాకీర్, యాదగిరి, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి

మోమిన్‌పేట: తల్లీపిల్లల ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరమని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోమిన్‌పేట పంచాయతీ కార్యాలయంలో పోషణ మాసోత్సవాల సంబురాల్లో భాగంగా చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. తల్లీపిల్లల ఆరోగ్యానికి సహజ సిద్ధంగా లభించే వనరులపై ఆధారపడాలన్నారు. ఆకుకూరలు తప్పక తీసుకోవాలన్నారు. కూరగాయలు, పండ్లు, గ్రుడ్లు, పాలు నిత్యం స్వకరించడంతో ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. బాలామృతంతో మానసికంగా, శారీరకంగా అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, శశికళ. పంచాయతీ కార్యదర్శి స్వప్న, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి

పరిహారం చెల్లించాలని ధర్నా

శంకర్‌పల్లి: పారిశుద్ధ్య కార్మికుడు శ్రీనివాస్ విధులు నిర్వహిస్తూ ఫిట్స్ వచ్చి మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ మున్సిపల్ యూనియన్ నాయకులు ధర్నా చేపట్టారు. కార్మికుడు కుటుంబానికి న్యాయం చేయాలని, పరిహారం చెల్లించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ మాట్లాడుతూ.. విధులు నిర్వర్తిస్తున్నప్పుడే మృతి చెందినందున కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. అధికారులు స్పందించకపోతే కార్మికులంతా నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నాయకులతో కమిషనర్ యోగేశ్ మాట్లాడి, విషయాన్ని స్పెషల్ ఆఫీసర్, కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాములు, క్రిష్ణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు, కార్మికులు



కోమటికుంట చెరువులో పేరుకుపోయిన కాలుష్యం



బాలాపూర్ పెద్ద చెరువులో..

చెరువులు.. కాలుష్య కాసారాలు

- ఒకప్పుడు తాగునీరు, పంట నీరు అందించిన తటాకాలు
- మానవ తప్పిదాలతో నేడు కలుషిత నీటి కేంద్రాలు
- ఇలాగే వదిలితే భూగర్భ జలాలూ కలుషితమయ్యే ప్రమాదం
- చెరువులను పరిరక్షించాలంటున్న ప్రజలు

బడంగ్‌పేట్: ఒకప్పుడు ప్రజలు తాగేందుకు, పంటలకు స్వచ్ఛమైన నీరందించిన చెరువులు నేడు మానవ తప్పిదాలతో కాలుష్య కేంద్రాలుగా మారుతున్నాయి. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ప్రజలు యథేచ్ఛగా మురుగు నీటిని వదులుతుండటంతో చెరువుల్లోకి చేరి కలుషితం అవుతున్నాయి. దీంతో చెరువులు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పరోక్షంగా తిరిగి ప్రజలపైనే ప్రభావం పడుతోంది.


డ్రైనేజీనీరు చెరువుల్లోకి..

బడంగ్‌పేట మున్సిపల్‌లో చెరువులకు ఢోకా లేదు. ప్రతి ఊరికి చెరువులు, కుంటలు ఉన్నాయి. కొన్ని కుంటలు రియల్ ఎస్టేట్ మాఫియాకి కనుమరుగైనప్పటికీ చెరువులు ఇంకా చెరబట్టకుండా బ్రతికే ఉన్నాయి. కానీ చెరువులు నాటి కళను కోల్పోయి కాలుష్యంతో వెక్కిరిస్తున్నాయి. బాలాపూర్‌లోని పెద్ద చెరువు, కుర్మల్‌గూడలోని అంతిరెడ్డి చెరువు, అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు, పోచమ్మకుంట చెరువు, ఎర్రకుంట చెరువు, నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు, మీర్‌పేట్‌లోని పెద్ద చెరువు, వెంకటాపూర్‌లోని బురాన్‌ఖాన్ చెరువు, గుర్రంగూడ, మల్లాపూర్, బడంగ్‌పేట్, మామిడిపల్లి తదితర గ్రామాల చెరువులు, కుంటలు కాలుష్యానికి గురవుతున్నాయి. మున్సిపల్‌లో రోజురోజుకు వలసలు పెరిగి ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు మొగ్గు చూపుతుండటంతో ఇబ్బడి దిబ్బడిగా వెంచర్లు వెలసి అందులో వేస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్లను గుట్టుచప్పుడు కాకుండా చెరువుల్లోకి వదులుతున్నారు. దీంతో చెరువుల్లో నీరు కాలుష్యమవుతున్నాయి. అధికారులకు ఈ విషయం తెలిసి కూడా మిన్నకుండిపోతున్నారు.

చెరువులను కాపాడాలి

నాడు చెరువులు తాగునీరు, సాగునీరు అందించి గ్రామాలను బతికిస్తే, ప్రస్తుతం ప్రజల స్వార్థంతో అవి కాలుష్య కాసారాలుగా మారిపోతున్నాయి. చెరువుల్లో కాలుష్యం పెరిగితే భూగర్భజలాల్లో కాలుష్యం పెరుగుతోందని తెలిసికూడా నిర్లక్ష్యంగా వదిలివేయడం బాధాకరం. చెరువులను కాలుష్య బారిన కాకుండా కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, నాయకులు ఆలోచనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శుభ్రం చేయిస్తాం



చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను, అలాగే వర్థ్యాలను తొలగించి శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇరిగేషన్ అధికారులను కలుపుకొని మరిన్ని చెరువులను పరిశీలించి వ్యర్థాలను తీసేస్తాం. చెరువుల చుట్టు పక్కల ఉన్న కాలనీవాసులు ప్లాస్టిక్ వస్తువులు, చెత్తను చెరువుల్లో వేయకుండా జాగ్రత్త పడాలి.

పి.సరస్వతి, కమిషనర్